## క్లుప్తంగా

### అభివృద్ధి పనులకు నిధుల మంజూరు



ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసిన సీతారాంపేట కాంగ్రెస్ నేతలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని సీతారాంపేట గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినందున స్థానిక కాంగ్రెస్ నేతలు గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలను తెలిపారు. వాటర్ పైపులైన్లు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు అడిగిన వెంటనే సుమారు రూ.2 కోట్ల నిధులను ఎమ్మెల్యే మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

### కాన్షీరాంకు నివాళి



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నేతలు

ఇబ్రహీంపట్నం: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు మాన్యవర్ కాన్షీరాం వర్ధంతిని ఆ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకులు గురువారం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కాన్షీరాం చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

### సేవాలాల్ సేన గ్రామ కమిటీ ఎన్నిక



నూతన సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో గురువారం సేవాలాల్ సేన నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాత్లావత్ రవి నాయక్ ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రవి నాయక్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్‌నాయక్, సోషల్ మీడియా కన్వీనర్‌గా శివనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లచ్చిరాంనాయక్, యువసేన అధ్యక్షుడిగా విజయ్‌నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన సభ్యులను నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సచిన్ రాథోడ్, అరుణ్‌నాయక్, రాకేశ్‌నాయక్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

### అభినందన



అనుమిత్రను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా

షాద్‌నగర్: గ్రూప్–1 పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన అనుమిత్రను బుధవారం పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కృష్ణవేణి స్కూల్‌లో విద్యనభ్యసించిన అనుమిత్ర గ్రూప్–1 పరీక్షలో రాణించినందున ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆమె స్వగృహానికి వెళ్లి సత్కరించి, అభినందించారు.

### అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



పోలీసుల అదుపులో నాయకుడు గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సు చార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ చలో బస్ భవన్‌కి పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం ఉదయం బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడే ముందస్తు అరెస్టులు చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డిని చందానగర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అంటూనే.. మిగతా వారిపై చార్జీల మోత మోగించడం సబబు కాదన్నారు.

# పెంచిన బస్సు చార్జీలు తగ్గించాలి



కడ్తాల్: పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



ఆమనగల్లు: బస్టాండ్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చలో బస్‌భవన్ పిలుపు
- పలుచోట్ల నాయకుల ముందస్తు అరెస్టు

ఆమనగల్లు: పెంచిన బస్సు చార్జీలను తగ్గించాలని, ఆర్టీసీ సంస్థను కాపాడాలని బీఆర్‌ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ సంస్థను కాపాడాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చలో బస్ భవన్ పిలుపు నేపథ్యంలో పట్టణానికి చెందిన పలువురు నాయకులు బస్సులో బయలు దేరుతుండగా పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌లో నాయకులు కొద్దిసేపు ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నిరంజన్‌గౌడ్, ఖలీల్, శ్రీనునాయక్, పంతు నాయక్, వెంకటేశ్, యాదయ్య, జగన్, రమేశ్, గణేశ్, భాస్కర్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.

**పోలీస్‌స్టేషన్‌కు తరలింపు**

కడ్తాల్: బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన చలో బస్ భవన్ ముట్టడి నేపథ్యంలో గురువారం ఉదయం నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బస్ భవన్ కార్యక్రమానికి వెళుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు తులసీరాం, హరిచంద్, భూనాథ్, నాయకులు పంతునాయక్, సాయిలు, రామకృష్ణ, లాయక్‌అలీ తదితరులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో పోరాటాలను ఆపలేరని నేతలు హెచ్చరించారు.

# సంక్షేమ పథకాలను వివరించండి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రగతిని కాంక్షించి ప్రజలంతా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం, అభ్యర్థుల ఎంపిక తదితర విషయాలపై చర్చించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభ్యర్థుల విజయం కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 22 నెలల కాంగ్రెస్ పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలు ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో రాష్ట్రం అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఆశించిన రీతిలో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. రిజర్వేషన్ల మూలంగా పోటీకి అవకాశం రాని నాయకులు, కార్యకర్తలకు పార్టీ తగువిధంగా గుర్తింపునిస్తుందని ధైర్యం చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోతీలాల్, శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పర్వత్‌రెడ్డి, ఆనంద్, సంజీవ్‌కుమార్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకు విపక్షాలు వ్యతిరేకం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: రాష్ట్రంలో విపక్ష పార్టీలు బీసీ రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. గురువారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీలకు న్యాయం చేయాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వం కల్పిస్తే విపక్షాలు అడ్డుకుంటున్నాయని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపితే బీజేపీ ప్రభుత్వం కాలయాపన చేసిందని విమర్శించారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా బీసీలకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు న్యాయం చేయాలని చూస్తుంటే, కొందరు కోర్టుకు వెళ్లి బీసీ రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా పిటిషన్‌లు దాఖలు చేసి రాద్ధాంతం చేస్తున్నారని ఆక్షేపించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, హీరాసింగ్ తదితరులు ఉన్నారు.

### బీసీలకు న్యాయం చేసేందుకు కృషి

చేవెళ్ల: బీసీలకు న్యాయం చేయాలనే పట్టుదలతోనే కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్‌లను ప్రకటించి ఎన్నికలకు వెళ్లిందని కాంగ్రెస్ పార్టీ గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు అన్నారు. చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు అసెంబ్లీలో అన్ని పార్టీలు అంగీకరించి, ఇప్పుడు ఎన్నికలు జరగకుండా ప్రతిపక్ష పార్టీల నాయకులే తెరవెనక ఉంటూ కోర్టుకు వెళ్లి డ్రామాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్‌లు ఇవ్వాలంటూనే మరో వైపు కోర్టులకు వెళ్లటం వెనక వీరికి బీసీలపై ఉన్న ప్రేమ ఏమిటో అర్థం అవుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పకుండా ఇచ్చిన మాట ప్రకారమే బీసీలకు 42శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహిస్తుందని నమ్మకం ఉందన్నారు. ఎన్ని అడంకులు వచ్చినా ఎదుర్కొనేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నద్ధంగానే ఉందని తెలిపారు. బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటే బీసీలంతా ఏకమైన వ్యతిరేకులపై తిరుబాటు చేస్తామని హెచ్చరించారు.

**రిజర్వేషన్ల హామీ బూటకం**

చేవెళ్ల: బీసీ రిజర్వేషన్ల హామీ అంతా బూటకమని ఈ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని బీసీ సంఘం నాయకుడు రామగౌడ్ మండిపడ్డారు. గురువారం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించటంపై ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ కేవలం ప్రజలను మోసం చేసేందుకేనని బీసీలపై ప్రేమతో కాదని తేలిపోయిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచుకునేందుకు బీసీ రాగం ఎత్తుకున్నారన్నారు. కనీసం బీసీలకు 42శాతం ఇస్తామని చెప్పిన రిజర్వేషన్ల కూడా రాజకీయం కోసం వాడుకుంటుందని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు గడిచినా కూడా ఎన్నికలు లేక పంచాయతీ పాలన కుంటుంపడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మహిళల ఆరోగ్యంతోనే ప్రగతి

ఇబ్రహీంపట్నం సీడీపీఓ వినీతాదేవి



సామూహిక సీమంతంలో ఐసీడీఎస్ సీడీపీఓ, సిబ్బంది

యాచారం: మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ ప్రగతి సాధ్యమని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ వినీతాదేవి పేర్కొన్నారు. పోషణ మాసంలో భాగంగా గురువారం యాచారం రైతు వేదికలో చిన్నారులకు అన్నప్రాసన, మహిళలకు సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. అందు కోసం మహిళలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మహిళలు, గర్భిణుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో యాచారం ప్రభుత్వా వైద్యాధికారి ప్రియాంక, ఐకేపీ ఏపీఎం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాల సందర్శన



ఆమనగల్లు: ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రదర్శిస్తున్న ఏడీఏ శోభారాణి, ఎంపీడీఓ మాధురి




కడ్తాల్: చల్లంపల్లి ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ సమర్పిస్తున్న కృష్ణ

ఆమనగల్లు: మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎంపీడీఓ మాధురి తెలిపారు. కాగా స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఎంపీడీఓ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల అధికారిగా ఏడీఏ శోభారాణి, ఆకుతోటపల్లి, పోలెపల్లి ఎంపీటీసీల ఎన్నికల అధికారిగా చందులాల్, మంగళపల్లి, మేడిగడ్డ, కోనాపూర్ ఎంపీటీసీల ఎన్నికల అధికారిగా పద్మను నియమించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆమనగల్లు సీఐ జానకీరామ్‌రెడ్డి, షాద్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ సందర్శించారు.

**తలకొండపల్లిలో ఒకటి**

తలకొండపల్లి మండల కేంద్రంలో ఎంపీటీసీ స్థానానికి తొలిరోజు ఒక నామినేషన్ దాఖలైంది. తలకొండపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ, 12 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాంపూర్ ఎంపీటీసీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా కృష్ణ నామినేషన్ దాఖలు చేశారు.

# గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మధుసూదన్‌రెడ్డి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షాబాద్ పీఆర్ఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న 69వ మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ జూనియర్, సీనియర్ లెవల్‌లో క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఏఎంఆర్ ట్రస్ట్ ఎంతో కృషి చేస్తోందన్నారు. క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో క్రీడాపాలసీ ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికితీసి, వారికి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో యువత ప్రతిభ కనబర్చాలని సూచించారు. ప్రతి పాఠశాలల్లో ఒక స్పోర్ట్ టీచర్ ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. క్రీడాపోటీల నిర్వహణతో గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడుతాయన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, రవీందర్‌నాయక్, మునగపాటి నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, లింగం, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారావు, రాహుల్‌గుప్తా, శేఖర్, కృష్ణారెడ్డి, యాదయ్య, రఫీక్, మహేశ్ ఉన్నారు.



కడ్తాల్: శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

# కాంగ్రెస్‌లో చేరికలు



ఆమనగల్లు: కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న సత్యం

కడ్తాల్: మండల పరిధిలోని గడ్డమీదితండాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అమృనాయక్ గురువారం ఉదయం బీఆర్‌ఎస్‌లో చేరగా తిరిగి సాయంత్రానికి మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి(సొంతగూటికి) వెళ్లారు. ఈ మేరకు పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా అమృనాయక్ మాట్లాడుతూ.. ఎప్పటికి తాను కాంగ్రెస్ వాదినేనని, వ్యక్తిగత పనిమీద మండల కేంద్రానికి వెళితే బీఆర్‌ఎస్ నాయకులు గులాబీ కండువా కప్పారని చెప్పారు. అది తన సమ్మతితో జరగలేదని చెప్పారు. అలాగే తదితర గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు నర్సింహ, బీచ్యానాయక్, వెంకటేశ్, హీరాసింగ్, శంకర్, భిక్షపతి, కిషన్, రాంచందర్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపాలనతో సంక్షేమం**

ఆమనగల్లు: కాంగ్రెస్ పాలనతోనే ప్రజలకు సంక్షేమం సాధ్యమని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. ప్రజా పాలన పట్ల వివిధ పార్టీల నాయకులు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో గురువారం బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు వెంకటయ్య, జంగయ్య, పోచయ్య, కుమార్, చుక్కలయ్య, గోపి, వెంకటయ్య, మహేశ్‌లు ఎగిరిశెట్టి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిందని, ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేస్తుందని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని సత్యం ధీమా వ్యక్తం చేశారు.

### ఆహారంలో చక్కెర శాతం తగ్గించుకోవాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి

కొత్తూరు: నిత్యం తీసుకునే ఆహారంలో బాలింతలు, గర్భిణులు చక్కెర, నూనెల వినియోగాన్ని చాలావరకు తగ్గించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి సూచించారు. మండలంలోని కొడిచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. తాజా కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల్లో అధికంగా పోషకాలు ఉంటాయని వివరించారు. నిత్యం భోజనంలో పోషకాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు నాగలక్ష్మి, భారతమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### నటుడు శ్రీకాంత్ భరత్‌ను అరెస్టు చేయాలి

షాద్‌నగర్: జాతిపిత మహాత్మాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు శ్రీకాంత్ భరత్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గందె సురేశ్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. స్వాతంత్ర్య సాధనలో కీలక పాత్ర పోషించిన మహాత్మా గురించి ప్రపంచ దేశాల్లో గొప్పగా చెప్పుకుంటున్నారన్నారు. అవమానపరిచేలా మాట్లాడిన నటుడిపై చర్యలు తీసుకోవాలన్నారు.